క్లుప్తంగా

సక్రమంగా పౌష్టికాహారం..



చిన్నారుల హాజరు పరిశీలిస్తున్న ఎంపీడీఓ గీతాంజలి

సీతంపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఎంపీడీఓ కె. గీతాంజలి అన్నారు. మండలంలోని దబరలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ, టీహెచ్‌ఆర్ (టేక్ హోమ్ రేషన్) సక్రమంగా అందుతున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కుమ్మరిగండిలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు.

అంగన్‌వాడీల సేవలు మెరుగుపడాలి

కురుపాం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఐసీడీఎస్ కురుపాం ఏసీడీపీఓ ఎన్.రాజ్యలక్ష్మి సూచించారు. కురుపాం పంచాయతీ పరిధిలో ఉన్న పూతికవలస అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో పౌష్టికాహార నిల్వలను, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలతో పాటు కేంద్ర పరిసరాలను పరిశీలించారు. పౌష్టికాహారాన్ని ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు అందించాలని, గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట సూపర్‌వైజర్లు వి.వి.రమణమ్మ, విజయగౌరీ, శ్రావణి ఉన్నారు.

స్థలం కేటాయింపు



రవాణా శాఖకు స్థలాన్ని అప్పగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

గరుగుబిల్లి: ఆటోమెటిక్ డ్రైవింగ్ ట్రాక్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని మండలంలోని నాగూరులో మండల తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పార్వతీపురం రవాణా శాఖ అధికారులకు అప్పగించారు. నాగూరులో గతంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు భూమిని సేకరించారు. సేకరించిన భూమిలో కొంత స్థలం ఖాళీగా ఉంది. ఈ స్థలంలో సుమారు ఐదు ఎకరాలను రవాణాశాఖ అధికారులకు తహసీల్దార్ జీవీ జనార్దన్ బుధవారం అప్పగించారు.

శిథిలావస్థకు రక్షిత ట్యాంక్

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రం గుమ్మలక్ష్మీపురంలో ఉన్న రక్షిత మంచినీటి పథకం ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో గత రెండు రోజులుగా గ్రామంలో నీటి సరఫరా నిలిచిపోయింది. స్థానిక సర్పంచ్ బి.గౌరీశంకరరావు సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు వెంటనే స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.నాగేశ్వరరావు బుధవారం శిథిలావస్థకు చేరిన ట్యాంకును పరిశీలించారు. తక్షణమే మరమ్మతు పనులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కొత్త ట్యాంకు నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు డీఈఈ చెప్పారు. ఆయన వెంట జేఈ ప్రవీణ్, వైస్ సర్పంచ్ కిశోర్, వార్డు సభ్యులు జె.వెంకటరావు, వీఆర్వో బి.కృష్ణ ఉన్నారు.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలి

గుమ్మలక్ష్మీపురం: చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలని ఏపీసీఎస్‌ఎఫ్ డీపీఎం పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని గొరడ గ్రామంలో నాబార్డ్ సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో తాడంగి అరుణ అనే మహిళ రైతు అంతర పంటగా సాగు చేసిన శ్రీరాగి పంటలో బుధవారం చేపట్టిన పంటకోత ప్రయోగాన్ని ఆయన పరిశీలించారు. పంట దిగుబడి ఆశాజనకంగా ఉండటం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. చిరుధాన్యాల పంటలైన రాగులు, కొర్రలు, ఊదలు, జొన్నలు తదితర వాటికి మార్కెట్లో డిమాండ్ ఉందని, రైతులు చిరుధాన్యాలను సాగుచేసి లాభాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, జీవ కోఆర్డినేటర్ జి.ప్రబోధ్ తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



చెముడుగూడలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ పథకాలపై అవగాహన, ప్రయోజనం కల్పించేందుకే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు అన్నారు. మండలంలోని చెముడుగూడ, పి.ఆమిటి గ్రామాల్లో బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలు, వాటి లబ్ధిని ఆయా శాఖల అధికారులు ప్రజలకు వివరించారు. కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్ పాల్, జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ పర్యవేక్షించారు.



సీతంపేట: దోనుబాయిలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ఆదినారాయణ, తదితరులు



భామిని: నులకజోడులో సంక్షేమ పథకాల జాబితా ఆవిష్కరిస్తున్న జేసీఎస్ కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు బూస బాలకృష్ణ



పాలకొండ రూరల్: భాసూరువారి వీధి సచివాలయ పరిధిలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, నగర పాలకవర్గ సభ్యులు

జగనన్నతోనే అభివృద్ధి ..

రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని పలువురు అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ పాలనకు.. ప్రస్తుత ప్రభుత్వ పాలనకు బేరీజు వేసుకుని రానున్న ఎన్నికల్లో పనిచేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు బుధవారం నిర్వహించారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందివ్వడంతో పాటు ఇంటి వద్దకే ప్రభుత్వ పాలనను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. అవినీతిరహిత పాలన సాగిస్తున్న జగనన్నకు మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

– పాలకొండ/కురుపాం నెట్‌వర్క్



పాలకొండ: గొట్ట మంగళాపురంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బి.భాను, సర్పంచ్ కరణం బాబ్జీ, తదితరులు



కొమరాడ: కళ్లికోటలో సంక్షేమ పథకాల డ్యాష్ బోర్డు ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి, పార్టీ శ్రేణులు



గుమ్మలక్ష్మీపురం: లుంబేసులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎంపీపీ కుంబురుక దీనమయ్య, పార్టీ శ్రేణులు



కురుపాం: గొటివాడలో ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలో వివరిస్తున్న ఎంపీపీ శెట్టి పద్మావతి



గరుగుబిల్లి: ఉద్దవోలు సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డ్యాష్‌బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ఉరిటి రామారావు, తదితరులు

ఫిష్ ఆంధ్ర సూపర్ బజార్ ప్రారంభం



ఫిష్ ఆంధ్ర సూపర్ బజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ ప్రోత్సాహంతో ఏర్పాటు చేసుకున్న ఫిష్ ఆంధ్ర యూనిట్‌ను సద్వినియోగించుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎప్పరిక సరోజినికి ఫిష్‌ఆంధ్రా సూపర్ బజార్ ఏర్పాటుకు పీఎంఎంఎస్‌వై కింద ప్రభుత్వం 60 శాతం సబ్సిడీపై రూ.20 లక్షల యూనిట్‌ను మంజూరు చేసింది. నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి బుధవారం యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు సరైన సేవలను అందిస్తూ, స్వయం ఉపాధి పొందేందుకు ప్రభుత్వం అందించిన ప్రోత్సాహాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్ఓ వేముల తిరుపతయ్య, ఎఫ్‌డీఓ గోపీకృష్ణ, ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, స్థానిక సర్పంచ్ బి.గౌరీశంకరరావు, గ్రామపెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పిల్లలతో పనులు చేయిస్తే చర్యలు

● న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: పద్నాలుగేళ్ల లోపున్న చిన్నారులచే దుకాణాలు, గృహాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్థానిక జూనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్ అన్నారు. పార్వతీపురం జిల్లా సహాయ లేబర్ అధికారులతో కలసి పట్టణంలోని పలు దుకాణాల్లో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బాల కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆర్‌వీ శ్రీనివాసరావు, లేబర్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు, ప్యానెల్ అడ్వకేట్ ఎం.వెంకటేశ్వరరావు, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు జి.సత్యంనాయుడు, కె.రవికుమార్, దిశ పోలీస్ సిబ్బంది లావణ్య, రవిబాబు, తదితరులున్నారు.



వ్యాపార సముదాల్లో యజమానులకు సూచనలు చేస్తున్న న్యాయమూర్తి విజయ్ రాజ్‌కుమార్

ప్రజా సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయండి

● ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

పాలకొండ రూరల్: ప్రజాసాధికార బస్సుయాత్రను విజయవంతం చేసేందుకు ప్రతిఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కోరారు. ఈనెల 24న బస్సుయాత్రలో భాగంగా తొలుత మండలంలోని చిన మంగళాపురం గ్రామంలో ఉదయం 10.30 గంటలకు విలేకరుల సమావేశం నిర్వహించి, అనంతరం అక్కడి సచివాలయం, ఆర్‌బీకే భవనాలను వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన మంత్రులు, శాసనసభ్యులు, పార్లమెంట్, శాసనమండలి సభ్యులు ప్రారంభిస్తారు. ఈ మేరకు గ్రామంలో జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు బుధవారం పరిశీలించి, సర్పంచ్ గోగుల కల్యాణికి పలు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రెస్‌మీట్, ప్రారంభోత్సవాల అనంతరం అక్కడి నుంచి భారీ బైక్ ర్యాలీతో యాత్ర గోపాలపురం చేరుకుంటుందన్నారు. అక్కడి గౌరీవిహార్ ఫంక్షన్ హాల్‌లో భోజన విరామం తర్వాత తిరిగి 3 గంటల నుంచి యాత్ర వైఎస్సార్ కూడలి, కోటదుర్గమ్మ దేవస్థానం మీదుగా ఆర్‌సీఎం చర్చి సమీపంలోని బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీలు సూర్యప్రకాష్, వాకముడి అనిల్‌కుమార్, డీసీసీబీ డైరెక్టర్ బంకి లక్ష్మణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు మజ్జి నవీన్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ బి.గౌరు, మండల సచివాలయాల కన్వీనర్ కోట అజయ్‌బాబు, పార్టీ ముఖ్య నాయకులు పాలవల ధవళేశ్వరరావు, గార బలరాంనాయుడు, కనుముల సూర్యనారాయణ, నీలాపు శ్రీనివాసరావు తదితరులున్నారు.



సాధికార యాత్ర ఏర్పాట్లపై సమాలోచనలు చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, తదితరులు

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

గరుగుబిల్లి: ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యంను ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ జీవీ జనార్దన్ బుధవారం తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యంను మిల్లులకు తరలించేందుకు 62 ట్రాక్టర్లకు జీపీఎస్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దళారీలు, మిల్లర్ల ప్రమేయంలేకుండా ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. ఆర్‌బీకేల వద్ద ధాన్యం తేమ శాతం పరిశీలించేందుకు అవసరమైన పరికరాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు.

సందర్శన

సీతంపేట: మండలంలోని హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల ఇంగ్లిష్ ఎల్‌ఐపీ శిక్షణ కేంద్రాన్ని డీఈఓ ప్రేమ్‌కుమార్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇక్కడ నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యార్థులకు బోధించాలని సూచించారు. ఎంతమంది ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు.. శిక్షణ ఇస్తున్న తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ లిల్లీరాణి, హెచ్‌ఎం ఉమావాణి, తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి..

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈఓ ప్రేమ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల నోట్‌బుక్స్ పరిశీలించడంతో పాటు, ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆనందరావు, హెచ్‌ఎం హేమసుందర్, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

సమస్యలు పరిష్కరించాలి..

పాలకొండ: అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ నాయకురాలు ఎన్.హిమప్రభ కోరారు. ఈ మేరకు మండలంలోని బుక్కూరు కేంద్రంలో కార్యకర్తలకు బుధవారం కరపత్రాలు అందించారు. తమ డిమాండ్ల సాధన కోసం డిసెంబర్ 8 నుంచి కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు.

హక్కు పట్టాల పంపిణీ చారిత్రాత్మకం

● ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



వీరఘట్టంలో లబ్ధిదారులకు డీకేటీ పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: రైతులకు హక్కు పట్టాల పంపిణీ చారిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీకేటీ పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ విక్రాంత్ పాల్గొని లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్ణయంతో మండలంలోని తూడి, కత్తులకవిటి, అడారు గ్రామాల్లో వందల ఏళ్ల నుంచి ప్రభుత్వ భూములు సాగుచేస్తున్న రైతులకు మేలు జరుగుతోందన్నారు. ఇంతవరకు ఏ ముఖ్యమంత్రీ చేయని సాహసోపేతమైన నిర్ణయాన్ని మన ముఖ్యమంత్రి జగనన్న తీసుకున్నారని చెప్పారు.

అనంతరం తూడి గ్రామంలో 106 మందికి.. కత్తులకవిటిలో నలుగురికి.. అడారులో 27 మందితో మొత్తం 137 మంది లబ్ధిదారులకు 95 ఎకరాల ఎసైన్డ్ భూమిని పంపిణీ చేశారు. హక్కు పట్టాలు పంపిణీ చేయడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చందక సత్యనారాయణ, ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, నీలం సత్యంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకులం విద్యార్థులు

కొమరాడ: స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో స్థానిక గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్–17 విభాగంలో అథ్లెటిక్స్‌లో ఎ.రాహుల్, కె.శ్రీను ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

వీరు ఈ నెల 25,26 తేదీల్లో గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విజయనగరం జిల్లా తరఫున పాల్గొంటారని పాఠశాల ప్రిన్సిపాల్ డి.లక్ష్మణరావు బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సేంద్రియ విధానంలో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ విజయభారతి

గరుగుబిల్లి: తక్కువ వ్యయంతో అధిక దిగుబడులను సాధించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి అన్నారు. మండలంలోని సంతోషపురంలో బుధవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని, సేంద్రియ ఎరువులను వినియోగించి సేద్యం చేస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఖరీఫ్‌లో పండిన ధాన్యంను కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలన్నారు. ఏ గ్రేడ్ రకం రూ.2203, సాధారణ రకం రూ.2,183లు మద్దతు ధరగా నిర్ణయించినట్లు చెప్పారు.

వైభవంగా సత్యసాయి జయంతి వేడుకలు

పాలకొండ రూరల్: భగవాన్ సత్యసాయి 98వ జయంతి వేడుకలు పట్టణంలో వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం స్థానిక సాయి మందిరంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాలకు డీఎస్పీ జీవీ.కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ శ్రేయస్సును కోరి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం భక్తులు కోలాటం ప్రదర్శించారు.



సేవాసమితి సభ్యుల కోలాటం

నోట్‌బుక్ తప్పనిసరిగా రాయాలి..

● డీఈఓ ప్రేమ్‌కుమార్

భామిని: తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులు తప్పకుండా నోట్‌బుక్స్‌లో రాసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్ సూచించారు. మండలంలోని ఏపీ మోడల్ స్కూల్, జెడ్పీహెచ్ స్కూల్‌ను బుధవారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఎస్‌ఏ–1లో మంచి మార్కులు తెచ్చుకొన్న విద్యార్థులతో సెల్ఫీలు దిగి ప్రోత్సహించారు. బురుజోలలో శిథిలావస్థకు చేరిన పాత పాఠశాల భవనాన్ని, కొత్తగా నాడు – నేడులో భవన నిర్మాణ స్థలాలను డీఈఓ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎ.శ్రీనివాస్, ప్రిన్స్‌పాల్ ఆర్.శివకుమార్, హెచ్‌ఎం కె.వెంకటరావు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



మంచి మార్కులు సాధించిన విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

విశాఖ బయలుదేరిన క్రీడాకారులు

సీతంపేట: జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన గిరిజన విద్యార్థులు బుధవారం విశాఖ బయలుదేరి వెళ్లారు. గురువారం నుంచి విశాఖలో జరగనున్న పోటీల్లో వీరు పాల్గొంటారు. ఐటీడీఏ పరిధిలో సీతంపేట, మెళియాపుట్టి, మందస క్లస్టర్లకు చెందిన 26 మంది విద్యార్థులు స్టేట్ మీట్‌లో తలపడతారు. వీరికి ఐటీడీఏ డిప్యూటీ ఈఓ ఎ.లిల్లీరాణి, ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవి, హెచ్‌ఎం టి. చంద్రరావు, ఎ.భాస్కరరావు, తదితరులు అభినందనలు తెలిపారు.



స్టేట్‌మీట్‌కు ఎంపికైన విద్యార్థులు

గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి

● ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కల్పనాకుమారి అన్నారు. మండలంలోని మారుమూల గ్రామలైన కుమ్మరిగండి, గులుమూరు గ్రామాల్లో బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుమ్మరిగండికి రోడ్డు సదుపాయం కల్పించాలని.. అంగన్‌వాడీ భవనానికి బిల్లులు చెల్లించాలని గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అలాగే వన్‌ధన్ వికాస్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి పీఓ స్పందిస్తూ సస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఏపీఓ సాగర్, తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

అవగాహన తప్పనిసరి

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖాధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. మండలంలోని తంపటాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు, ముఖ్యంగా పొగ దట్టంగా ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖాధికారి సర్వేశ్వరరావు